ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
శుక్రవారం 3 జనవరి 2025
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 16.0



డిండికి నీళ్లు



డిండి రిజర్వాయర్(ఫైల్)

- పాలమూరు నుంచి అర టీఎంసీ చొప్పున నీటిని తరలించేందుకు సన్నాహాలు
- వివాదాస్పదంగా మారనున్న సర్కార్ నిర్ణయం
- దోలాయమానంలో పాలమూరు రంగారెడ్డి ఆయకట్టు

నాగర్‌కర్నూల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నుంచి డిండికి నీటిని తరలించాలని ప్రభుత్వ యోచన వివాదాస్పదంగా మారుతోంది. ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో ప్రారంభమైన పనులు వివాదాస్పదంగా మారనున్నాయి. దీన్ని వ్యతిరేకిస్తూ ప్రధాన రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి. అత్యంత కీలకంగా ఉన్న పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నుంచి డిండికి నీళ్లు తరలిస్తే ఎగువ ప్రాంతంలో ఉన్న జిల్లాల పరిస్థితి ఏంటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

డిండికి నీటి తరలింపునకే సర్కార్ మొగ్గు?

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి, వనపర్తి, వికారాబాద్ జిల్లాల పరిధిలో 12.30 లక్షల ఎకరాలకు సాగునీరందించాలనే లక్ష్యంతో రూ. 33వేల కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. అనేక అవాంతరాలతో ప్రాజెక్టును పూర్తి చేయ డానికి మరో 33వేల కోట్లు అంటే మొత్తానికి 63వేల కోట్లు ఖర్చవుతాయని ఇరిగేషన్ అధికారులు నివేదికను రూపొందించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో

(మిగతా 6లో..)

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నుంచి డిండికి నీళ్లు తరలిస్తే ఎగువ ప్రాంతంలో ఉన్న జిల్లాల పరిస్థితి ఏంటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నార్లాపూర్, ఏదుల మధ్య నుంచి అర టీఎంసీ నీటిని డిండికి తరలించాలని వచ్చిన ప్రతిపాదన పట్ల అప్పట్లో తీవ్రమైన వ్యతిరేకత దృష్ట్యా ఆ ప్రభుత్వం అలాంటి యోచనను విరమించుకున్నది. అయితే ఇటీవల మళ్లీ డిండికి నీటి తరలింపు వ్యవహారం ప్రధానంగా తెరమీదకొచ్చింది. దీన్ని వ్యతిరేకిస్తూ ప్రధాన రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి.

వాటర్ లీకేజీ
నివారణకు చర్యలు

- లీకేజీ ప్రాంతాన్ని గుర్తించేందుకు రెండు నెలలు పట్టే అవకాశం



శ్రీశైలం ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రం

7

కృష్ణానదిపై వంతెన నిర్మాణానికి నిధులు

- 10వ తేదీ వరకు టెండర్ల ప్రక్రియ
- రూ.1082.56 కోట్లతో పనులు
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ రావు

6

చిన్నారులకు..
చిరునవ్వుల వరం

- 11వ విడత 'ఆపరేషన్ స్మైల్' ప్రారంభం
- ఈ నెల 31 వ తేదీ వరకు నిర్వహణ
- గత ఆరేళ్లలో నారాయణపేట జిల్లాలో 537 మంది బాలలకు విముక్తి



7

చివరి ఆయకట్టు వరకు
నీరు అందించాలి



జూరాల కాల్వలను పరిశీలించిన అనంతరం అధికారులకు సూచనలు చేస్తున్న పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

ఓ రైతు టిఫిన్ బాక్సును ట్రాక్టర్‌లో నుంచి తీసి పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి

చిన్నంబావి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా చిన్నంబావి మండల కేంద్రం నుంచి వెల్టూరు క్రాస్ రోడ్డు వరకు జూరాల కాల్వలను మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ రైతులకు అవసరం ఉన్న మూడు తడులకు నీటిని అందించాలని, ఏ ఒక్క పంట ఎండిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని, ప్రతీ ఒక్క లస్కర్ నీటిని వృథా చేయకుండా చివరి ఆయకట్టు వరకు నీరు అందించాలని ఆదేశించారు. అనంతరం పాడైన కాల్వల మరమ్మతుకు తక్షణమే సరిపడా బడ్జెట్ కేటాయిస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని మంత్రి తెలిపారు. పెద్దదగడ నుంచి చిన్నంబావి శివారులోని వ్యవసాయ పొలానికి ట్రాక్టర్‌పై వెళ్తున్న రైతు కుర్మయ్యతో మాట్లాడారు. ట్రాక్టర్‌లో ఉన్న ఆయన టిఫిన్ బాక్స్ తీసి చూశారు. ఈ అన్నం రెండు పూటల సరిపోతుందా అని అడిగారు. కార్యక్రమంలో కేఎంజీఆర్ ట్రస్ట్ చైర్మన్ కొత్త కళ్యాణ్ రావు, రైతులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ చాంపియన్
మహబూబ్‌నగర్, ఖమ్మం



విజేత మహబూబ్‌నగర్ పురుషుల జట్టును అభినందిస్తున్న దృశ్యం

- రన్నర్ మహబూబ్‌నగర్, ఖమ్మం
- పురుషులు, మహిళల విభాగాల్లో ముగిసిన సీఎం కప్ టోర్నీ
- మూడో స్థానంలో నారాయణపేట-మేడ్చల్ పురుషుల జట్టు
- మూడో స్థానంలో నిలిచిన రంగారెడ్డి-మేడ్చల్ మహిళల జట్టు
- విజేతలను అభినందించిన జిల్లా అధికారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ టోర్నీ చాంపియన్‌గా మహబూబ్‌నగర్, ఖమ్మం జట్లు నిలిచాయి. గురువారం పాలమూరు పట్టణంలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో జిల్లా క్రీడాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పురుషుల విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు ఖమ్మంపై 19-16తో గెలిచి చాంపియన్‌గా నిలువగా, మహిళల విభాగంలో ఖమ్మం జట్టు మహబూబ్‌నగర్‌పై 23-06తో పై గెలిచి విజేతగా నిలిచింది. పురుషుల విభాగంలో ఖమ్మం, మహిళల విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు రన్నర్‌గా నిలిచాయి. మూడో స్థానంలో పురుషుల విభాగంలో నారాయణపేట-మేడ్చల్,

- మిగతా 6లో..


నకిలీ ధ్రువీకరణ పత్రాలపై
విచారణ

- నకిలీ ఏజెన్సీ ధ్రువపత్రాలతో ఉద్యోగాలు పొందారనే ఆరోపణ
- పదరకు చెందిన ఐదుగురి ధ్రువపత్రాల పరిశీలన
- మరిన్ని రోజులు విచారణ కొనసాగే అవకాశం

7



మన్ననూరు ఐటీడీఏ కార్యాలయంలో ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు



కమ్ముకున్న పొగమంచు

నల్లమలలో రెండు రోజులుగా చలి తీవ్రత అమాంతంగా పెరిగిపోయింది. ఉదయం తొమ్మిది గంటల దాకా నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని మన్ననూరు, పటువర్లపల్లి, దోమలపెంట, మద్దిమడుగు ప్రధాన రహదారులపై పొగమంచు కమ్ముకోవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. మన్ననూరు వ్యవసాయ పొలాల వద్ద గురువారం ఉదయిస్తున్న సూర్య కిరణాలను కప్పేస్తూ కనిపించిన దృశ్యం ఆంధ్రజ్యోతి కెమెరాకు చిక్కింది.

- మన్ననూర్, ఆంధ్రజ్యోతి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చదివిన తాండ్ర జిల్లా పరిషత్ హై స్కూల్

సీఎం చదివిన పాఠశాల భవన నిర్మాణానికి
రూ. 5 కోట్లు మంజూరు

కల్వకుర్తి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చదివిన నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తాండ్ర జడ్పీహెచ్ భవన నిర్మాణానికి రూ.5కోట్లు మంజూరయ్యాయి. ముఖ్యమంత్రి కొన్నాళ్ల క్రితం కల్వకుర్తిలో జరిగిన సభలో తాను చదివిన స్కూల్‌కు రూ. ఐదు కోట్ల నిధులు మంజూరు చేస్తానని ప్రకటించారు. పాఠశాల విద్యాశాఖ నుంచి జీవో నెంబరు-3 ద్వారా రూ. ఐదు కోట్లు మంజూరు చేస్తూ పరిపాలన ఆమోద ఉత్తర్వులు గురువారం వెలువడ్డాయి. తాండ్రలోని జడ్పీహెచ్ఎస్ అన్ని హంగులతో నిర్మాణం జరగనుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కాయితీ ఆశాదీప్‌రెడ్డి తెలిపారు. నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి గ్రామ ప్రజలు, విద్యార్థుల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న మల్లురవి, చిత్రంలో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, బాలాజీసింగ్

- ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలను ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు సభ్యుడు బాలాజీసింగ్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మౌలిక సదుపాయాలను అడిగితెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం విద్యావ్యవస్థ పటిష్టతకు ఎంతో కృషిచేస్తోందని పేర్కొన్నారు. పాఠశాలలోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు తమ దృష్టికి తేవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్తీక్ కుమార్, ప్రిన్సిపాల్ స్వర్ణరత్నం, నాయకులు తదితరులు ఉన్నారు.

షేర్ మార్కెట్లో
రూ.2 కోట్లు పెట్టుబడులు

- అధిక వడ్డీ ఆశతో అప్పులిచ్చిన మరికొందరు
- ఏజెంట్ మృతితో చేతులెత్తేసిన బంధువులు
- న్యాయం కోసం స్టేషన్ మెట్లెక్కిన బాధితులు
- పట్టించుకోకపోవడంతో ఎస్పీ ఫిర్యాదు



గద్వాల పట్టణంలోని సుంకులమ్మ మెట్టువద్ద ఏర్పాటు చేసిన ఏంజిల్‌వన్ సర్వీస్ కార్యాలయం


6

ప్రారంభమైన టెట్

- రెండు కేంద్రాల్లో నిర్వహణ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఆన్‌లైన్‌లో గురువారం నుంచి ప్రారంభమైంది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జేపీఎన్‌సీఈ కళాశాల, ఫాతిమా విద్యాలయంలో ఈ పరీక్ష కొనసాగుతోంది. ఉదయం తొమ్మిది గంటల నుంచి 11.30 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సాగింది. జేపీఎన్‌సీఈ కళాశాలలో కేంద్రంలో ఉదయం సెషన్‌కు 180 మంది అభ్యర్థులకు గాను 149 హాజరు కాగా 31 మంది అభ్య ర్థులు హాజరు కాలేదు. మధ్యాహ్నం పరీక్షకు 180 మంది గాను 147 మంది హాజరు కాగా 33 మంది గైర్హాజరయ్యారు. ఫాతిమా విద్యాలయంలో నిర్వహిం చిన పరీక్షకు 180 మందికి గాను 148 మంది హాజరు కాగా 32 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌కు 184 మందికిగాను 163 మంది హాజరుకాగా 21 మంది అభ్యర్థులు గైర్హాజర య్యారు. పరీక్ష కేంద్రాన్ని అధికారులు పరిశీలించారు. కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.









నెట్‌బాల్ చాంపియన్ మహబూబ్‌నగర్, ఖమ్మం

(మొదటిపేజీ తరువాయి)

మహిళల విభాగంలో రంగారెడ్డి-మేడ్చల్ జట్లు నిలిచాయి.

-విజేత జట్లను అభినందించిన జిల్లా అధికారులు..

సీఎం కప్ రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ విజేతలను జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ మధుసూదన్, జిల్లా అటవీశాఖ అధికారి సత్యనారాయణ, జిల్లా క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. నెట్‌బాల్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నెట్‌బాల్ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విక్రమ్ ఆదిత్యరెడ్డి, ఖాజాఖాన్, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, ఖోఖో సంఘం సెక్రటరీ విలియం, యోగా సంఘం సెక్రటరీ బాల్‌రాజ్, వ్యాయామ ఉపాధ్యాయులు వేణుగోపాల్, సాదత్‌ఖాన్, అరుణజ్యోతి, స్వప్న, డీఎస్‌ఏ కార్యాలయ సిబ్బంది రవీందర్‌రెడ్డి, విజయ్‌కుమార్, ఉమేష్, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



రన్నర్‌గా నిలిచిన మహబూబ్‌నగర్ మహిళ జట్టు

విద్యాభివృద్ధి కోసం మహబూబ్‌నగర్ విద్యానిధి

- నా బర్త్‌డేకు ఎవరూ ఫ్లెక్సీలు కట్టొద్దు.. ఆ డబ్బులు విద్యానిధికి ఇవ్వండి
- ప్రతిఏటా రూ.2 కోట్లు జమ చేయడమే లక్ష్యం
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందని, విద్యలో మహబూబ్‌నగర్‌ను తెలంగాణలోనే నెంబర్ వన్ చేయాలన్నదే తన లక్ష్యమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ ఏడాది కాలంలో ఎన్నో విద్యాసంస్థలు, స్కిల్ యూనివర్సిటీలను తీసుకురావడం జరిగిందని, కొత్తసంవత్సరం విద్యకు సంబంధించి మహబూబ్‌నగర్ విద్యానిధి ఏర్పాటు చేయాలనే మరో కీలక నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. అనుకున్నదే తడవుగా ఎస్‌బీఐ మహబూబ్‌నగర్ కలెక్టరేట్ బ్రాంచ్‌లో విద్యానిధి అకౌంట్ తీయడం జరిగిందని, కలెక్టర్ ఆధ్వర్యంలో సీపీవో ఈ అకౌంట్‌ను చూస్తారన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఏటా రూ.రెండు కోట్లు విద్యానిధిలో జమ చేయాలన్నదే లక్ష్యమని, తనతో పాటు తన సహచరులు, శ్రేయోభిలాషులు, వ్యాపారులు, ఉద్యోగులు ఎవరైనా విద్యానిధి అకౌంట్(43676342719)నెంబర్‌కు డొనేట్ చేయవచ్చని కోరారు.

ఈ నిధిలో ఏమేమి కార్యక్రమాలు చేయాలో అందరం ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని, విద్యార్థులకు అనేక అంశాలలో సత్వర పరిష్కారం కోసం ఈ నిధి ఉపయోగపడుతుందని చెప్పారు. పేద విద్యార్థుల చదువు, ట్రైనింగ్ సెంటర్ల ఏర్పాటు, సైన్స్‌ఫెయిర్‌ల ఏర్పాటు, టోర్నమెంట్స్, ప్రతిభ గల విద్యార్థుల ప్రోత్సాహం, కల్చరల్ ఆక్టివిటీస్ వంటి రంగాలకు వెచ్చిస్తామన్నారు. ఇకపై వచ్చే నాలుగేళ్ల ప్రతినెల తన జీతం డబ్బులలో సగం అంటే నెలకు లక్ష రూపాయలు విద్యానిధికి ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. నేడు తన పుట్టిన రోజు సందర్భంగా ఎవరూ ఫ్లెక్సీలు ఏర్పాటుచేయవద్దని, శాలువాలు తీసుకురావద్దని తనపై ఏమాత్రం ప్రేమ, అభిమానం ఉన్నా ఆ డబ్బులను విద్యానిధికి ఇవ్వాలని కోరారు. పెళ్లిళ్లు, శుభకార్యాలు చేసుకునేవాళ్లు కూడా రూ.ఐదు వేల విద్యానిధికి జమచేస్తే వారి పేరిట విద్యార్థుల అవసరాలకు వెచ్చించడం జరుగుతుందని వివరించారు.

రానున్న రోజుల్లో పురపాలిక పరిధిలో రెండు వార్డులకు ఒక లర్నింగ్ సెంటర్‌ను ఏర్పాటుచేసి ఆయా వార్డులలో ఎమ్మెస్సీ, డీఎస్సీ చదివిన యువతతో ఆయా వార్డులకు చెందిన పిల్లలకు ఉచిత ట్యూషన్ చెప్పించే కార్యక్రమం చేస్తామని, దీనివల్ల వేలమంది పిల్లలకు సబ్జెక్ట్‌పై అవగాహన వస్తుందని అన్నారు. పాలకులకు దూరదృష్టి ఉంటే ప్రజలకు అద్భుతమైన సేవలందరించవచ్చని చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ అన్నారు.

ఇందులో భాగంగానే ఇటీవల అన్ని వసతి గృహాలను విజిట్ చేశామని, ప్రతి ఆదివారం ఒక విద్యాసంస్థలో శ్రమదానం చేయాలనే కార్యక్రమాన్ని తీసుకున్నామన్నారు. దీనివల్ల అక్కడికి వెళ్లిన సమయంలో ఆ విద్యాసంస్థలో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

అధరం సమిష్టిగా ముందుకెళితే కష్టమైనదేమీ ఉండదని, అనుకున్న లక్ష్యాలను చేరుకుంటామన్నారు. మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, నాయకులు వినోద్‌కుమార్, సిరాజ్‌ఖాద్రి, పెద్దవిజయ్‌కుమార్, రాములుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

● విద్యానిధికి రూ.50 వేలు..

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి మహబూబ్‌నగర్ మండల కాంగ్రెస్ తరపున విద్యానిధికి రూ.50 వేలు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఎమ్మెల్యే ఆయనను అభినందించారు.

డబుల్‌సెంచరీ చేసిన క్రీడాకారుడికి మాజీ మంత్రుల అభినందన



క్రీడాకారుడిని సన్మానించిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, డాక్టర్ సి.లక్ష్మారెడ్డి

జడ్చర్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన అండర్-14 క్రికెట్ పోటీల్లో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు క్రీడాకారుడిగా పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, డబుల్ సెంచరీ చేసిన క్రీడాకారుడు కేతన్‌ను మాజీ మంత్రులు హరీశ్‌రావు, డాక్టర్ సి.లక్ష్మారెడ్డిలు అభినందించారు. హైదరాబాద్‌లోని హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంలో గురువారం అభినందించారు. క్రీడాకారుడు కేతన్.. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, చెర్లపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్ కుమారుడు అని తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. క్రికెట్ పోటీలో 138 బంతుల్లో 236 పరుగులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారుడిని శాలువా కప్పి అభినందించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రణీల్‌చందర్, చర్లపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్, కరాటేరాజు, ఆంజనేయులు తదితరులున్నారు.

ఎన్నికల గుర్తులు వచ్చేశాయ్..

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ఎన్నికలు జనవరి చివరి వారంలో లేదా ఫిబ్రవరి 2వ వారంలో నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో 3 విడతలుగా ఎన్నికలను నిర్వహించనున్నారు. అందులో భాగంగా డిసెంబరు 12 నుంచి గ్రామాల్లో ఓటరు అభ్యంతరాలు స్వీకరించారు. 17న 441 గ్రామ పంచాయతీల్లోని 3838 వార్డుల్లో ముసాయిదా ఓటరు జాబితాను ప్రదర్శించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బ్యాలెట్ పేపర్ ముద్రణ కోసం ఏజెన్సీలను టెండర్‌కు పిలవడం జరిగింది. టెండరులో తక్కువ కోడ్ చేసి, గతంలో అనుభవం ఉన్న రెండు ఏజెన్సీలకు బ్యాలెట్ పేపర్ ముద్రణ బాధ్యతలు అప్పగించారు.

సర్పంచు, వార్డు సభ్యుల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమయ్యే నాటికి 50శాతం బ్యాలెట్ పేపర్ ముద్రించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఎన్నికల నిర్వహణకోసం ఇటీవలే కలెక్టర్ విజయేందిర బోయి 12 మంది జిల్లా స్థాయి అధికారులను నోడల్ అధికారులుగా నియమించింది.

వారితో పాటు స్టేజ్-1, స్టేజ్-2 అధికారులను నియమించ నున్నారు. వారితో పాటు ప్రిసైడింగ్ అధికారులను, అదనపు ప్రిసైడింగ్ అధికారులను నియమించి వారికి ఎన్నికల ప్రక్రియపై శిక్షణను ఇవ్వనున్నారు.

● సర్పంచులకు 30 గుర్తులు..

ఉంగరం, కత్తెర, బ్యాట్, టీకప్పు, విమానం, ఫుట్‌బాల్, షటిల్‌కాక్, కుర్చి, వంకాయ, బ్లాక్‌బోర్డు, బెండకాయ, కొబ్బరితోట, వజ్రం, బకెట్, డోర్ హ్యాండిల్, టీ జల్లెడ, చేతికర్ర, మంచం, పడక, టేబుల్, బ్యాటరీ లైట్, మనిషి-తెరచాప, బాస్కెట్ బాల్, వేణువు, చైన్, చెప్పులు, గాలిబుడగ, స్టంప్స్ గుర్తులతో పాటు నోటాను గుర్తును ఉంచారు.

● స్టేజ్-1, స్టేజ్-2 అధికారుల కేటాయింపు

నాలుగు నుంచి ఆరు గ్రామ పంచాయతీలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేస్తారు. ఏర్పాటు చేసిన క్లస్టర్‌కు ఒక స్టేజ్-1 అధికారిని నియమిస్తారు. ఆ అధికారి నామినేషన్ల స్వీకరణ, అభ్యర్థుల గుర్తులను కేటాయింపు ప్రక్రియను నిర్వహిస్తారు. స్టేజ్-2 అధికారులను జీపీకి ఒకరిని నియమిస్తారు. వీరు ఎన్నికల ప్రక్రియ మొత్తం నిర్వహించాల్సి ఉంటుంది. పోలింగ్ ముగిసిన తర్వాత కౌంటింగ్ ప్రక్రియతో పాటు విజేతలను ప్రకటించే వరకు వీరు ఎన్నికల విధులు నిర్వహించాల్సి ఉంటుంది.

వీరికి అదనంగా 3838 మంది ప్రిసైడింగ్ అధికారులను, అదనపు ప్రిసైడింగ్ అధికారులను నియమిస్తారు. వీరికి ఎన్నికల విధుల పట్ల జిల్లా కేంద్రంలో కలెక్టర్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఎన్నికలు ఎపుడు వచ్చినా సమర్థవంతగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేస్తున్నది.

● వార్డు సభ్యులకు 20 గుర్తులు..

జగ్, గౌను, స్టౌవ్, స్టూల్, సిలిండర్, టీకప్పు, బీరువా, కుండ, డిష్‌యాంటినా, గడియారం, మూకుడు, ఐస్‌క్రీం, గాజుగ్లాసు, పోస్టుడబ్బా, కవరు, హాకీ-బంతి, నెక్‌టై, కటింగ్ ప్లేయర్, విద్యుత్ స్తంభం, కెటిల్‌లతో పాటు వార్డు సభ్యులకు కూడా నోటా గుర్తును కేటాయించారు.

● 12మంది నోడల్ అధికారులు

పంచాయతీ ఎన్నికల టీం లీడర్‌గా మహబూబ్‌నగర్ ఆర్డీవో నవీన్, బ్యాలెట్ బాక్స్‌ల ఇన్‌చార్జి అధికారిగా జిల్లా పశువైద్యాధికారి మధుసూదన్ గౌడ్, ఎన్నికల రవాణాధికారిగా ఆర్టీవో రఘురాం, ఎన్నికల మెటీరియల్ అధికారిగా వ్యవసాయశాఖ అధికారి వెంకటేష్, జిల్లా ఎన్నికల మానిటరింగ్ అధికారిగా డీఆర్‌డీవో నర్సింహులు, వ్యయ పరిశీలకుడిగా జిల్లా కోఆపరేటివ్ అధికారి శంకరాచారి, ఎన్నికల పర్యవేక్షక అధికారిగా జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేష్, బ్యాలెట్ పేపర్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారిగా జడ్పీ సీఈవో వెంకటరెడ్డి, ఎన్నికల ప్రచార అధికారిగా డీపీఆర్వో పి.శ్రీనివాస్, హెల్ప్‌లైన్ నోడల్ అధికారిగా పేక్ఇర్ఫాన్ డీఎం సివిల్ సప్లై, ఎన్నికల అభ్యంతారాల స్వీకరణ అధికారిగా సీపీవో రవీందర్‌ను నియమించారు.

సూపర్ చెక్‌తో అక్రమాలకు అడ్డుకట్ట

- ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో రాష్ట్ర వ్యాప్తంగా టాప్-7లో గద్వాల జిల్లా
- సర్వే పూర్తయిన వాటిలో ఐదు శాతం ఇళ్ల సూపర్ చెక్‌కు ఆదేశాలు
- గురువారం నుంచి క్షేత్ర స్థాయిలో మొదలైన సూపర్ చెక్ సర్వే



సర్వే వివరాలను చెక్‌చేస్తున్న ఎంపీడీవో వెంకటయ్య

అయిజటౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక పథకంగా రూపుదిద్దుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహిస్తున్నారు. ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదాయల వివరాలను ఇప్పటికే అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించారు. గద్వాల జిల్లా వ్యాప్తంగా 1,47,132 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకోగా గత ఏడాది డిసెంబరు 31 నాటికి 87 శాతం సర్వేను పూర్తి చేసి రాష్ట్ర వ్యాప్తంగా ఏడవ స్థానంలో నిలిచింది. తాజాగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే మరింత పారదర్శకంగా ఉండేందుకు గానూ రాష్ట్ర ప్రభుత్వం సర్వే పూర్తయిన వాటిలో అయిదు శాతం ఇళ్లను సూపర్‌చెక్ పేరుతో సర్వే చేయాలని నిర్ణయించింది. అంటే గద్వాల జిల్లా వ్యాప్తంగా 6 వేలకు పైబడి ఇళ్లను అధికారులు సూపర్‌చెక్ చేయనున్నారు. గురువారం నుంచే మండలస్థాయిలో ఎంపీడీవోలు, మునిసిపాలిటీ స్థాయిలో కమిషనర్‌లు, సీనియర్ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వేను కొనసాగిస్తున్నారు.

అక్రమాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలనే

ఇందిరమ్మ ఇళ్ల సర్వే జరుగుతున్న క్రమంలో ఆయా గ్రామాల్లో కొందరు పలుకుబడి కలిగిన వారు నాయకుల అవతారమెత్తి అక్రమ మార్గంలో ఇందిరమ్మ ఇళ్ల దందాను నడిపేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారనే ప్రచారం జరుగుతుంది. కానీ తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఇప్పుడు మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లలో ఎటువంటి అవకతవకలు జరగరాదనే దృఢ నిశ్చయంతో ఉంది. ఇందులో భాగంగానే సర్వే జరిగిన ఇళ్లలో మరో అయిదు శాతం పునపరిశీలన చేయిస్తే ఇటువంటి అక్రమార్కుల ఆట కట్టించవచ్చనే నిర్ణయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు. ఆన్‌లైన్ లిస్ట్‌లో పేర్లు లేకపోయినా కొందరు అక్రమార్కులు రెండవ విడత సర్వేలో మీ పేరు వచ్చేలా చూస్తామనే మోసపూరిత అక్రమాలకు ఈ సూపర్‌చెక్‌తో చెక్ పెట్టనున్నారు.

రాష్ట్రంలో టాప్ 7లో గద్వాల ఉంది

ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో డిసెంబరు 31 నాటికి గద్వాల జిల్లా రాష్ట్రంలో టాప్-7లో ఉంది. అందరు అధికారుల కృషి వల్లే ఈ ర్యాంకును సాధించాం. ప్రస్తుతం కూడా సూపర్‌చెక్ పేరుతో ఆయా మండలాలు, మునిసిపాలిటీల్లో అయిదు శాతం ఇళ్లను సర్వే చేస్తున్నాం. ఇందిరమ్మ ఇళ్లలో ఎలాంటి అక్రమాలు జరగరాదని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజలు కూడా మధ్యవర్తులను నమ్మి మోసపోరాదు.

- నర్సింగారావు, అదనపు కలెక్టర్, గద్వాల

షేర్ మార్కెట్లో రూ.2 కోట్ల పెట్టుబడులు

- ఏజెంట్ మృతితో చేతులెత్తేసిన బంధువులు
- న్యాయం కోసం స్టేషన్ మెట్లెక్కిన బాధితులు

గద్వాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టిన ఏజెంట్ మృతి చెందడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. కొందరు లాభాల కోసం, మరికొందరు అధిక వడ్డీకి ఆశపడి పెట్టుబడులు పెట్టారు. ఐదు నెలల క్రితం ఏజెంట్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో షేర్ మార్కెట్ గురించి తెలియని మృతుడి బంధువులు చేతులెత్తేశారు. దీంతో బాధితులు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడ న్యాయం జరగకపోవడంతో గురువారం ఎస్పీ శ్రీనివాస్‌రావుకి ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గద్వాల మండలం ఎర్రవల్లి గ్రామానికి చెందిన కుర్వ వెంకటేష్ ఆయన భార్య సుమిత్రలు కలిసి ఏంజిల్ వన్ పేరుతో గద్వాల పట్టణంలోని సుంకులమ్మ మెట్టువద్ద సర్వీస్ ఆఫీసును ఓపెన్ చేశారు. ఇందులో ఈక్విటీ, డీమ్యాట్, మ్యూచువల్ ఫండ్స్ క్రయవిక్రయాలు చేసేవారు. ఆయనతో పాటు బంధువులు, స్నేహితులు, మరికొందరితో షేర్ మార్కెట్‌లో దాదాపు రూ.2కోట్ల వరకు పెట్టుబడులు పెట్టించారు. గత ఆగస్టు వరకు ఎవరికి ఇబ్బందులు రాకుండా వెంకటేష్ చూసుకున్నాడు. ఆగస్టు నెలలో ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. షేర్ మార్కెట్ లావాదేవీలు చూసే వ్యక్తి మృతి చెందడం, భార్య సుమిత్రకు షేర్ మార్కెట్ గురించి తెలియకపోవడంతో అప్పటి నుంచి ఆఫీసు మూతపడింది. దీంతో ఇందులో పెట్టుబడులు పెట్టిన వ్యక్తులు, అప్పులు ఇచ్చిన వ్యక్తులు కుటుంబ సభ్యులపై ఒత్తిడి తెచ్చారు. షేర్ మార్కెట్‌లో పెట్టుబడులపై వారు చేతులెత్తేశారు. దీంతో బాధితులు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రజా ప్రతినిధులను కలిసి మొరపెట్టుకున్నారు. మొదట న్యాయం చేస్తామని చెప్పి పోలీసులు తర్వాత నిస్సహాయత వ్యక్తం చేయడంతో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. విచారణ చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని బాధితులు తెలిపారు.

ఫిర్యాదు వచ్చిన మాట వాస్తవమే..

బాధితులు ఫిర్యాదు చేసిన మాట వాస్తవమే.. షేర్ మార్కెట్ లీగల్ కావడం, అందులో పెట్టుబడిదారుల పేరుపై పెట్టారు. కొందరు అధిక వడ్డీకి అప్పులు ఇచ్చారు. ఇవన్నీ సివిల్ మ్యాటర్ కావడంతో న్యాయస్థానానికి వెళ్లమని చెప్పాను. బాధితులు న్యాయం చేయడం లేదనేది అవాస్తవం. లీగల్‌గా డబ్బులు రాబట్టుకోవాలని సూచించాను.

- శ్రీకాంత్, రూరల్ ఎస్సై, గద్వాల

డిండికి నీళ్లు



డిండి రిజర్వాయర్ (ఫైల్)

(మొదటి పేజీ తరువాయి..)

నార్లపూర్, ఏదుల మధ్య నుంచి అర టీఎంసీ నీటిని డిండికి తరలించాలని వచ్చిన ప్రతిపాదన పట్ల అప్పట్లో తీవ్రమైన వ్యతిరేకత దృష్ట్యా ఆ ప్రభుత్వం అలాంటి యోచనను విరమించుకుంది. అయితే ఇటీవల మళ్లీ డిండికి నీటి తరలింపు వ్యవహారం ప్రధానంగా తెరమీద కొచ్చింది. ఈ క్రమంలో నార్లపూర్, ఏదుల మధ్య నుంచి కాకుండా ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి కి నీటిని మళ్లించాలని నిర్ణయానికొచ్చారు.

కృష్ణా జలాలను ఎలా సర్దుబాటు చేస్తారు..?

డిండికి అర టీఎంసీ నీటిని మళ్లించాలని యోచిస్తున్న ప్రభుత్వం కృష్ణా జలాలను సర్దుబాటు చేయగలుగుతుందనే అంశంపై సందిగ్ధత నెలకొంది. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వికారాబాద్, రంగారెడ్డి, నారాయణపేట జిల్లాలకు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా 12లక్షల 30వేల ఎకరాలకు సాగునీరందించాలంటే కనీసం 120 టీఎంసీల జలాలు అవసరమవుతాయి. ఇందుకు సంబంధించిన వ్యవస్థ పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో ఇంత వరకు పూర్తి కాలేదు. 60 రోజులు కృష్ణానదికి వచ్చే వరద జలాల ఆధారంగా 120టీఎంసీల నీటిని తోడుకునే మెకానిజం ఏర్పాటు చేశామని చెప్పినప్పటికీ అది ఇంత వరకు రూపుదిద్దుకోలేదు. కృష్ణానదికి వచ్చే వరద జలాల విషయంలో గడిచిన 20ఏళ్ల నుంచి పరిస్థితిని పరిశీలిస్తే 30 నుంచి 40రోజులు వరద వచ్చిన సందర్భాలే అనేకం ఉన్నాయి. ఈ క్రమంలో అర టీఎంసీ నీటిని డిండికి తరలించాలని ప్రతిపాదన ఏదుల రిజర్వాయర్ నుంచి వచ్చినందున దిగువ ప్రాంతంలో ఉండే డిండికి తప్ప ఎగువ ప్రాంతాలైన మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు సాగునీరందే పరిస్థితి ఉండదనే భావనను ఈ ప్రాంత రైతులు వ్యక్తం చేస్తున్నారు.

రెండోసారి నిర్వాసితులుగా మారనున్న రైతులు

ఎంజీకేఎల్ఐ పథకం కింద భూములు కోల్పోయిన రైతాంగం పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కోసం కూడా త్యాగాలు చేయాల్సి వచ్చింది. ఏదుల నుంచి డిండికి నీటి మళ్లింపు చర్యలు ప్రారంభిస్తే రైతాంగం మరోసారి నిర్వాసితులుగా మారి మిగిలిన కొన్ని భూములను కూడా కోల్పోవాల్సిన పరిస్థితులు ఉత్పన్నం కానున్నాయి. మరో అంశమేమిటంటే ఎంజీకేఎల్ఐ పథకం కింద ఇప్పటికే ప్రధాన కాల్వల నిర్మాణం జరిగింది. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద డిండికి నీటిని తరలించాలంటే కాల్వల వ్యవస్థ ఖచ్చితంగా దెబ్బతింటుంది. దీని వల్ల సర్కార్‌కు మరింత ఆర్థిక నష్టం తప్పదని సాగునీటి నిపుణులు పేర్కొంటున్నారు.

రైతులను మోసగిస్తే సహించం



స్వప్రయోజనాల కోసం జిల్లా రైతాంగానికి ద్రోహం చేస్తే ఉద్యమిస్తాం. కృష్ణా నది మీద నిర్మించిన ప్రాజెక్టుల్లో అనేకమంది నిర్వాసితులుగా మారారు. శ్రీశైలం డిండి ప్రాజెక్టుల్లో కూడా ఈ ప్రాంత రైతులే అధికంగా నష్టపోయారు. ఏదుల నుంచి డిండికి నీటిని తరలించే ప్రక్రియను తక్షణమే ఉపసంహరించుకోవాలి.

- నాగం జనార్దన్‌రెడ్డి, మాజీ మంత్రి

కమీషన్ల కోసం కక్కుర్తి పడొద్దు



కమీషన్ల కోసం కక్కుర్తిపడి జిల్లా రైతాంగ ప్రయోజనాలను కాంట్రాక్టర్లకు పణంగా పెడితే ఎట్టి పరిస్థితుల్లో సహించం. రైతులే మాకు అండదండ. వారి కోసం మేము ఎన్ని త్యాగాలు చేయడానికైనా సిద్ధంగా ఉంటాం.

- గువ్వల బాలరాజు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే



పాలమూరు జిల్లా అంటేనే వలసలకు ప్రసిద్ధి. ఇప్పుడిప్పుడే రైతులు కుదుట పడుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం వారిపై గుదిబండ వేయడానికి సిద్ధం కావడం దురదృష్టకరం. జిల్లా రైతుల ప్రయోజనాలను విస్మరించి స్వలాభం కోసం ఇతర జిల్లాలకు ప్రయోజనం చేకూర్చాలని చూస్తే ఆందోళన తప్పదు.

- ఎల్లేని సుధాకర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ఉత్తీర్ణతా శాతాన్ని పెంచాలి : డీఐఈవో

ఆత్మకూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలలో ఉత్తీర్ణతా శాతాన్ని పెంచే విధంగా అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి అంజయ్య సూచించారు. ఆత్మకూరు పట్టణంలోని జూనియర్ కళాశాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు పరీక్షలంటే భయం, మానసిక ఒత్తిడికి గురి కాకుండా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. అలాగే పాఠ్యాంశాలలో ప్రశ్నలు తలెత్తితే అధ్యాపకులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యవర్ధన్ రెడ్డి, అధ్యాపకులు విశ్వేశ్వర్, రాఘవేందర్, వీణ, లలితమ్మ, కురుమూర్తి తదితరులు ఉన్నారు.

బీచుపల్లి గురుకులంలో అధికారుల విచారణ

ఎర్రవల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి గురుకుల పాఠశాలలో గురువారం అధికారులు విడివిడిగా విచారణ చేపట్టారు. ఇటీవల బీచుపల్లి గురుకుల విద్యార్థులు ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌పై తమను అకారణంగా కొడుతున్నాడని, ప్రిన్సిపల్‌ను మార్చాలని డిమాండ్ చేస్తూ గద్వాల పట్టణానికి కాలినడకన వెళ్లి నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గురువారం కలెక్టర్ ఆదేశాల మేరకు ఎర్రవల్లి తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో అజర్ మొహీయుద్దీన్, ఎంఈవో అమీర్‌పాషాలు పాఠశాలలో విచారణ చేపట్టారు. విద్యార్థులతో, తల్లితండ్రులతో, పాఠశాల స్టాఫ్‌తో విడివిడిగా సమావేశమై అభిప్రాయాలను సేకరించారు. ఈ విచారణను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు త్రిసభ్య కమిటీ అధికారులు తెలిపారు.

కృష్ణానదిపై ఐకానిక్ వంతెనకు నిధులు

- 10వ తేదీ వరకు టెండర్ల ప్రక్రియ
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ రావు

కొల్లాపూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా నదిపై ఐకానిక్ వంతెన నిర్మాణానికి ఈ నెల 10వ తేదీ వరకు టెండర్ల ప్రక్రియ పూర్తి కానున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో నేషనల్ హైవేస్ రీజినల్ అధికారి కృష్ణప్రసాద్‌ను ఎల్లేని సుధాకర్‌రావు కలిశారు. ఈ సందర్భంగా ఎల్లేని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో 167 కే జాతీయ రహదారి పనులను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పనులు నాణ్యతగా కొనసాగుతున్నాయని తెలిపారు. మరో ఐదారు నెలల్లో రహదారి మొత్తం పూర్తి చేయాలని అధికారిని కోరినట్లు ఎల్లేని తెలిపారు. సోమశిల వద్ద కృష్ణా నదిపై ఐకానిక్ వంతెన నిర్మాణానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ ఈనెల 10వ తేదీ వరకు పూర్తచేసుకొని రూ.1082.56 కోట్లతో పనులు మార్చి, ఏప్రిల్‌లో ప్రారంభం అవుతాయని ఆయన తెలిపారు. బ్రిడ్జికి సంబంధించిన అప్రోచ్ రోడ్ల కోసం రూ.436.9 కోట్లు (తెలంగాణలో ఎనిమిది కిలో మీటర్ల పొడవు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన 5.3 కిలో మీటర్ల) మంజూరు చేశారని, ఈనెల 15వ తేదీ వరకు టెండర్లు పూర్తి చేసి మార్చిలో పనులు ప్రారంభించనున్నట్లు నేషనల్ హైవే రీజినల్ అధికారి కృష్ణ ప్రసాద్ తెలిపారని ఆయన అన్నారు. కొల్లాపూర్‌కు జాతీయ రహదారైనా, పర్యాటక అభివృద్ధి అయినా, ఐకానిక్ వంతెన అయినా బీజేపీ ద్వారానే సాధ్యమైందని ఆయన తెలిపారు.



నేషనల్ హైవే, రీజినల్ అధికారి కృష్ణ ప్రసాద్‌ను కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు

ట్రేడర్స్ బాధితులకు న్యాయం చేస్తాం

- సీఐ టాటాబాబు

అయిజ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ట్రేడర్స్ బాధితులకు న్యాయం చేస్తామని శాంతినగర్ సీఐ టాటాబాబు అన్నారు. గురువారం అయిజ పోలీస్టేషన్‌ను తనిఖీ చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనకు అన్యాయం జరిగిందని వెంకటరమణ అనే బాధితుడు ముందుకు వచ్చి ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశామన్నారు. ఇంకా ఎవరైనా ఉంటే, ఫిర్యాదు చేయవచ్చన్నారు. అక్రమాలకు, మోసాలకు, కొమ్ము కాసే వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఏజీజీకే ట్రేడర్సు నిర్వాహకులలో ఒకరైన గజేంద్రగౌడ్‌ను పోలీస్టేషన్‌కు పిలిపించి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.



రోడ్డుపై భోజనాలు చేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు

వంటావార్పుతో ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

గద్వాల టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : డిమాండ్ల సాధన కోసం స్థానిక ఆర్డీవో కార్యాలయం సమీపంలో నిరవధిక సమ్మె కొనసాగిస్తున్న సమగ్ర శిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) ఉద్యోగుల ఆందోళన గురువారం 24వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఉద్యోగులు శిబిరం వద్ద వంటావార్పు చేపట్టి రోడ్లపైనే భోజనాలు చేస్తూ తమ నిరసనను తెలిపారు. రిటైర్ట్ ఎంఈవో రాజు, పలువురు హైస్కూల్ గెజిటెడ్ హెడ్ మాస్టర్లు శిబిరం వద్దకు వచ్చి ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి సంఘీభావం తెలిపారు. సమ్మెలో గద్వాల అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ స్పెషల్ ఆఫీసర్ శేషన్న, కేజీబీవీల స్పెషల్ ఆఫీసర్లు శ్రీదేవి, పద్మావతి, గోమతి, చెన్నబసమ్మ, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

స్పోర్ట్స్ బాక్స్

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో మూడవ స్థానంలో గద్వాల జట్టు



జిల్లా జట్టుతో ఫుట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు బండల వెంకట్రాములు, కార్యదర్శి విజయకుమార్ తదితరులు

గద్వాల అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : సీఎం కప్ ఫుట్‌బాల్ టోర్నీ, పురుషుల విభాగంలో జోగుళాంబ గద్వాల జిల్లా జట్టు మూడవ స్థానంలో నిలిచింది. హైదరాబాద్‌లోని హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో మూడు రోజుల పాటు కొనసాగాయి. ఈ సందర్భంగా జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు బండల వెంకట్రాములు గురువారం విలేకరులతో మాట్లాడారు. గద్వాల ఫుట్‌బాల్ క్రీడాకారులకు రాష్ట్రంలో మంచి పేరు ఉందన్నారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో గద్వాల జిల్లా జట్టు మంచి ఆటతీరును కనబరచి, మూడవ స్థానంలో నిలవడంపై హర్షం వ్యక్తం చేశారు. జోగుళాంబ గద్వాల, కామారెడ్డి జట్లు తలపడగా 4-1 పాయింట్ల తేడాతో జిల్లా జట్టు మూడవ స్థానంలో నిలిచిందని కోచ్, జిల్లా అసోసియేషన్ సెక్రటరీ విజయ్‌కుమార్ తెలిపారు. పోటీల్లో గోల్స్ సాధించిన క్రీడాకారులకు సీనియర్ క్రీడాకారుడు నరసింహరాజు నాలుగు వేల రూపాయల పారితోషికాన్ని అందించారు. క్రీడాకారులను ట్రెజరర్ త్యాగరాజు, ప్రవీణ్ సేవాసమితి అధ్యక్షుడు ఇండికా శివ, సీనియర్ క్రీడాకారులు జగన్, రోసి వెంకట్రాముడు, చిన్న, రాజారెడ్డి, గోపాల్ రెడ్డి, సతీశ్, పరశు, సత్తి అభినందించారు.

జాతీయ స్థాయి పోటీలకు పెద్దఆదిరాల విద్యార్థి పవన్



విద్యార్థి పవన్‌తో ప్రధానోపాధ్యాయుడు మల్లయ్య, ఉపాధ్యాయులు

జడ్చర్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : సాఫ్ట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలంలోని పెద్దఆదిరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పవన్ ఎంపికయ్యారు. నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్‌లో గత నెలలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు తరఫున పాల్గొన్న పవన్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. మహారాష్ట్రలోని జల్గావ్‌లో ఈ నెల ఏడు నుంచి తొమ్మిదవ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు మల్లయ్య, పీడీ మోయిన్, ఉపాధ్యాయులు పవన్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధు, చంద్రశేఖర్, నార్యానాయక్, శ్యాంసుందర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రెండు ఆవులు, ఒక ఎద్దు అపహరణ



పశువులు అపహరణకు గురైన కొట్టాన్ని చూపుతున్న కొండన్న

మదనాపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, మదనాపురం మండలంలోని శంకరంపేట గ్రామంలో రెండు ఆవులు, ఒక ఎద్దును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఈ సంఘటన బుధవారం రాత్రి జరిగింది. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొండన్న రోజు మాదిరిగానే తన పశువులను బుధవారం రాత్రి కొట్టం దగ్గర కట్టేసి ఇంటికెళ్లాడు. గురువారం ఉదయం వెళ్లి చూడగా రెండు ఆవులు, ఒక ఎద్దు కనిపించలేదు. గ్రామంలో, సమీప గ్రామాల్లో వెతికినా వాటి ఆచూకీ లభించలేదు. వాటి విలువ దాదాపు రెండు లక్షల రూపాయలు ఉంటుందని బాధితుడు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన చెప్పారు.

రెండు ఇసుక టిప్పర్ల పట్టివేత

ఎర్రవల్లి, జనవరి 2 : (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకున్నట్లు ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి చౌరస్తాలో బుధవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అర్ధరాత్రి సమయంలో కర్నూలు వైపు నుంచి గద్వాల పట్టణానికి ఇసుక లోడ్‌తో రెండు టిప్పర్లు వస్తుండగా ఆపి విచారించారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. కానిస్టేబుల్ శ్రీను ఫిర్యాదు మేరకు రెండు టిప్పర్ల డ్రైవర్లు గోకారి, బాష, బెక్కెం సురేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

» ఏఆర్ ఏఎస్‌ఐకి గాయాలు

తిమ్మాజిపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనం, కారు ఢీకొని ఏఆర్ ఏఎస్‌ఐ గాయపడ్డారు. సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, తిమ్మాజిపేటకు చెందిన గుణవర్ధన్ జిల్లా కేంద్రంలో ఏఆర్ ఏఎస్‌ఐగా పని చేస్తున్నారు. బుధవారం సాయంత్రం ఆయన ద్విచక్రవాహనంపై పొలం నుంచి ఇంటికి వెళ్తుండగా, గ్రామ సమీపంలో జడ్చర్ల నుంచి నాగర్‌కర్నూల్ వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొన్నది. ప్రమాదంలో గాయపడిన ఆయనను కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని యశోదా ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై ఆయన కుమారుడు సాయితేజ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



రామకృష్ణారెడ్డి (ఫైల్)

హన్వాడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం, కొనుగట్టుపల్లికి చెందిన రామకృష్ణారెడ్డి (30) గత ఏడాది నవంబరు 28న ద్విచక్రవాహనంపై మహబూబ్‌నగర్ నుంచి గ్రామానికి వెళ్తుండగా హన్వాడ సమీపంలో అదుపుతప్పి కింద పడటంతో తలకు తీవ్ర గాయమైంది. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు అతడిని జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. నెల రోజులుగా అక్కడ చికిత్స పొందుతున్న రామకృష్ణారెడ్డి గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చిన్నారులకు.. చిరునవ్వుల వరం



» 11వ విడత 'ఆపరేషన్ స్మైల్' ప్రారంభం » ఈ నెల 31 వ తేదీ వరకు నిర్వహణ
» గత ఆరేళ్లలో నారాయణపేట జిల్లాలో 537 మంది బాలలకు విముక్తి

నారాయణపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : బాల కార్మికులకు వెట్టి చాకిరీ నుంచి విముక్తి కలిగించి, వారి మోములో చిరునవ్వులను పూయించడమే వెలిగించడమే ధ్యేయంగా ప్రతీ సంవత్సరం ప్రభుత్వం 'ఆపరేషన్ స్మైల్', 'ఆపరేషన్ ముస్కాన్' కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అందులో భాగంగా బాలకార్మికులను గుర్తించి విముక్తి కలిగించడం, తప్పిపోయిన చిన్నారులను తల్లిదండ్రుల చెంతకు చేర్చడం, అక్రమ రవాణాకు గురైన పిల్లలను కాపాడి, పునరావాసం కల్పించడం తదితర కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ నెల ఒకటిన ప్రారంభమైన 11వ విడత ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం 31వ తేదీ వరకు కొనసాగనున్నది.



అధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్ (ఫైల్)

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో..

ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని పోలీసు శాఖ ఆధ్వర్యంలో స్త్రీ శిశు సంక్షేమ, కార్మిక శాఖలు, చైల్డ్ లైన్ భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నారు. నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్ గౌతమ్ పర్యవేక్షణలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో బడి బయట ఉన్న పిల్లలు, బాల కార్మికులను గుర్తించనున్నారు. అందుకోసం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా దాడులు నిర్వహించనున్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాలను అరికట్టడమే లక్ష్యంగా జిల్లా సంక్షేమ శాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, మునిసిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన సదస్సులను నిర్వహించనున్నారు. అలాగే ఇటుకబట్టీలు, పత్తి చేలు, హోటళ్లలో బాలలతో పని చేయిస్తున్న వారిపై, యాచక వృత్తి చేయిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు.

బాల కార్మిక వ్యవస్థను రూపుమాపుదాం



జిల్లా వ్యాప్తంగా ప్రతీ సంవత్సరం జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూలైలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వాటి ద్వారా నారాయణపేట జిల్లాలో గత ఆరేళ్లలో 1002 మంది బాల కార్మికులకు విముక్తి కల్పించాం. ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్నట్లు తెలిస్తే 100 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి. బాలలకు విముక్తి కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటారు. యజమానులపై కేసులు నమోదు చేస్తారు.

- యోగేష్ గౌతమ్, ఎస్పీ, నారాయణపేట

జిల్లా వ్యాప్తంగా తనిఖీలు

ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించనున్నారు. బడీడు పిల్లలందరూ బడిలో ఉండేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నారాయణపేట జిల్లా ఆపరేషన్ స్మైల్ -7 బృందం గతంలో డీజీపీ మహేందర్ రెడ్డి చేతుల మీదుగా జ్ఞాపికతో పాటు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. గత ఆరేళ్లలో ఆపరేషన్ స్మైల్ ద్వారా 537 మందికి, ఆపరేషన్ ముస్కాన్ ద్వారా 465 మంది బాల కార్మికులకు విముక్తి కలిగించారు.

వాటర్ లీకేజీ నివారణకు చర్యలు

» శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం ఘటనపై జెన్‌కో సీఎండీ విచారణ » రెండు రోజులుగా పంప్‌మోడ్ నిలిపివేత
» లీకేజీ ప్రాంతాన్ని గుర్తించేందుకు రెండు నెలలు పట్టే అవకాశం

దోమలపెంట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూలు జిల్లా సరిహద్దులోని శ్రీశైలం ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రం ఒకటో యూనిట్ డ్రాఫ్ట్‌ట్యూబ్ జీరో ఫ్లోర్ స్లాబ్ నుంచి వాటర్ లీకేజీ నివారణకు చర్యలు చేపట్టేందుకు టీజీ జెన్‌కో యాజమాన్యం చర్యలు చేపట్టింది. 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో బుధవారం శ్రీశైలం విద్యుత్ కేంద్రంలో వాటర్ లీకేజీపై కథనం ప్రచురితం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, నివారణ చర్యలు చేపట్టాలని జెన్‌కో సీఎండీని ఆదేశించినట్లు సమాచారం. ఈ విషయంపై బుధ, గురువారాలలో జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా, హైడెల్ డైరెక్టర్ సచ్చిదానందం ఈగలపెంట జెన్‌కో సీఈ రామ సుబ్బారెడ్డి, ఇతర ఇంజనీర్లతో ఆన్‌లైన్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎండీ ఆదేశం మేరకు శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో పంపుమోడ్, విద్యుత్ ఉత్పత్తిని నిలిపి వేశారు. వాటర్ లీకేజీపై స్థానిక ఇంజనీర్లతో సీఈ చర్చించారు.

విద్యుత్ కేంద్రానికి ప్రమాదం లేదు : జెన్‌కో సీఈ



కొన్ని రోజులుగా శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో నీటి ఊట రావడం సర్వ సాధారణమే అని గురువారం ఈగలపెంట జెన్‌కో సీఈ రామసుబారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకటో యూనిట్ డ్రాఫ్ట్ ట్యూబ్ జీరో ఫ్లోర్ స్లాబ్ భాగంలో లీకేజీ అవుతున్నది వాస్తవమేనని, డిసెంబరు 25న ఈ సమస్యను గుర్తించి సీసీ కెమెరాను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని సీఎండీ, డైరెక్టర్లకు తెలియపర్చామని, సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నంత పెద్ద సమస్య కాదని స్పష్టం చేశారు. వాటర్ లీకేజీని నివారించేందుకు తమ సిబ్బంది చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

సాగర్ వాటర్ లెవల్ తగ్గితేనే..

శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో నెలకొన్న లీకేజీ వాటర్ సమస్యను గుర్తించేందుకు సాగర్ బ్యాక్ వాటర్ లెవల్ ప్రస్తుతం 174 మీటర్లలో ఉన్నది. సాగర్ డ్యాం లెవల్ 140 మీటర్లకు తగ్గితే తప్పా దిద్దుబాటు చేపట్టే అవకాశం లేదు. ఈ లెవల్ సాగర్ నీటి మట్టం తగ్గేందుకు మరో రెండు నెలలు పట్టొచ్చని శ్రీశైలం ఇరిగేషన్ శాఖ అధికారులు చెబుతున్నారు. సర్జి చాంబర్‌కు గేట్లు మూయలేని పరిస్థితి. ప్రస్తుతం సర్జి చాంబర్‌లో 50 మీటర్ల లోతులో నీరు ఉన్నది. ఇక్కడ 25 మీటర్ల కిందకు వాటర్ లెవల్ తగ్గితేనే డ్రాఫ్ట్ ట్యూబ్‌లో ఉన్న నీటిని ఖాళీ చేయడానికి వీలు పడుతుందన్ని ఇంజనీర్లు అంటున్నారు. 50 మీటర్ల లోతు నీటిలోకి వెళ్లి లీకేజీ ప్రాంతాన్ని గుర్తించేందుకు డైవింగ్ టీమ్‌కు కూడా సాధ్యపడదని అంటున్నారు. లీకేజీ వాటర్‌తో విద్యుత్ కేంద్రానికి వచ్చిన సమస్య ఏమీ లేదంటునే అతర్గతంగా సమస్య పరిష్కారానికి వేగవంతంగా చర్యలు చేపడుతున్నారు.

పత్తి తూకంలో మోసం

» 80 క్వింటాళ్ల పత్తిని అదనంగా తీసుకున్నారని రైతుల ఆవేదన



తూకం వేసిన తర్వాత వ్యాపారి ఇచ్చిన లెక్క చీటీలను చూపిస్తున్న రైతులు

మన్ననూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఆరు గాలం కష్టించి పండించిన పత్తిని దళారులు తూకంలో మోసం చేశారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. 80 క్వింటాళ్ల పత్తిని అదనంగా తీసుకెళ్లారని అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామానికి చెందిన పత్తి రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సీసీ కేంద్రాల ద్వారాపత్తి కొనుగోలు ఆలస్యమవుతుందనే ఉద్దేశంతో రైతులు మన్ననూరులోని ఓ వ్యాపారి ద్వారా వారం రోజుల క్రితం పత్తిని ఆంధ్రా ప్రాంతానికి చెందిన పత్తి కొనుగోలుదారుడి వాహనంలో పత్తిని తూకం చేసి వేశారు. తాము వేసిన పత్తికి తప్పుడు తూకం చేసి అదనంగా పత్తిని తీసుకుపోయారని పత్తి రైతులు మన్ననూరులోని పత్తి కొనుగోలు చేసే వ్యాపారి వద్ద గొడవకు దిగారు. పత్తి కొనుగోలు చేసిన వ్యాపారికి పత్తి రైతులు ఫోన్ చేయగా స్పందించలేదని, ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు రైతులు తెలిపారు. పత్తి తూకంలో చేసిన మోసంలో రైతులకు ఐదు లక్షల రూపాయలకు పైగా నష్టం వాటిల్లిందని చెప్తున్నారు. మన్ననూరుకు చెందిన రైతు జమ్ముల వెంకటేశ్ మాట్లాడుతూ తూకానికి వేసిన పత్తి 90 క్వింటాళ్లు ఉండాల్సి ఉండగా 64 క్వింటాళ్లే ఉన్నట్లు బుక్కులో రాసిచ్చారని తెలిపారు. 26 క్వింటాళ్ల తేడా వచ్చిందని ఆయన పేర్కొన్నారు. మన్ననూరుకు చెందిన పార్వ తమ్మ అనే మహిళా రైతు మాట్లాడుతూ మొత్తం 20 క్వింటాళ్ల పత్తికి గాను తూకంలో ఆరు క్వింటాళ్ల పత్తిని అదంగా తీసుకున్నారని తెలిపారు.

నకిలీ ధ్రువీకరణ పత్రాలపై విచారణ

» ఐదుగురు ఉద్యోగుల సర్టిఫికెట్ల పరిశీలన » కలెక్టర్‌కు నివేదికను సమర్పిస్తామన్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మన్ననూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నకిలీ ఏజెన్సీ ధ్రువీకరణ పత్రాలతో ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన ఉద్యోగులపై ఉన్న తాధికారులు విచారణ ప్రారంభించారు. తప్పుడు ఏజెన్సీ ధ్రువపత్రాలతో ప్రభుత్వ ఉద్యోగాలు పొందారని పేర్కొంటూ కొందరు గిరిజన అభ్యర్థులు సమాచార హక్కు చట్టం కింద ఐటీడీఏ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. అందుకు స్పందించిన జిల్లా అధికార యంత్రాంగం విచారణ కమిటీని నియమించింది. ఈ మేరకు గిరిజన సాంస్కృతిక పరిశోధన మరియు శిక్షణ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ లీల ఆధ్వర్యంలో ఆర్డీవో మాధవి, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో రోహిత్ గోపిడి, డీటీడీవో ఫిరంగి గురు వారం ఉదయం నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మం డలం మన్ననూరు ఐటీ డీఏ కార్యాలయానికి చేరుకున్నారు. నకిలీ ఏజెన్సీ ధ్రువపత్రాలతో ప్రభుత్వ ఉద్యోగాలు పొందారనే ఆరోపణలున్న పదర మండలానికి చెందిన ఐదుగురిని కార్యా లయానికి పిలిపించారు. ఏజెన్సీ, కులం, విద్యాభ్యాసం తదితర ధ్రువ పత్రా లను క్షుణ్ణంగా పరిశీలించారు. వారం రోజుల పాటు విచారణ నిర్వహిస్తామని వారు తెలిపారు. పూర్తి వివరాలు సేకరిం చిన అనంతరం నివేదికను రూపొందించి కలెక్టర్‌కు పంపిస్తామన్నారు. ఇదే అంశంపై ఆరోపణలున్న మరో 29 మంది ఉద్యోగులపై కూడా విచారణ నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

సమాజ శాంతి కోసం ఆలోచించాలి

» పాలమూరు అధ్యయన వేదిక

పాలమూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : విద్వేషాన్ని విడనాడి, సమాజ శాంతి కోసం ఓపికగా, ప్రగతిదాయకంగా ఆలోచించాలని పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రజలు మత విద్వేషాల వలలో ఇరుక్కుపోవడం దేశ ప్రగతికి తీరని నష్టమని పేర్కొన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన బుక్ ఫెయిర్‌లో ప్రముఖ రచయిత ఎస్.వేణుగోపాల్ మీద, వీక్షణం బుక్‌స్టాల్ మీద, రచయిత్రి మెర్సీ మార్గరెట్ రచయిత్రి మీద దాడులు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. కంబలి రాములు అనే ఉపాధ్యాయుడిని బెదిరించి విద్యార్థుల కాళ్లు మొక్కించిన సంఘటనపై ఆందోళన వ్యక్తం చేశారు. వివేకవంతమైన చర్చా సంప్రదాయాన్ని, రాజ్యాంగ ప్రకటిత హక్కులు, ఆదర్శాలు, విలువలను వదిలి సాధించేది ఏమీ లేదని పేర్కొన్నారు.

చిన్నారిపై అఘాయిత్యానికి యత్నంపై విచారణ

నారాయణపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : చిన్నారిపై అఘాయిత్యానికి యత్నించిన ఘటనపై గురువారం డీఎస్పీ లింగయ్య గురువారం విచారణ నిర్వహించారు. నారాయణపేట జిల్లాలో తన ఇంట్లో అద్దెకు ఉంటున్న వారి చిన్నారిపై ఇంటి యజమాని అఘాయిత్యానికి యత్నించాడు. చిన్నారి గట్టిగా కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. బాలికను జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. సంఘటనపై కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయడంతో డీఎస్పీ గ్రామానికి చేరుకొని విచారణ నిర్వహించి, వివరాలు సేకరించారు.

విద్యార్థిని అదృశ్యం

పదర, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలంలోని ఓ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అదృశ్యం అయ్యింది. రెండు వారాల నుంచి సెలవులో ఉన్న ఆమె, గురువారం మధ్యాహ్నం తరువాత తల్లితో కలిసి కళాశాలకు వచ్చింది. తల్లి వెళ్లిపోయిన తర్వాత కొద్ది సేపటికి మళ్లీ బయటకు వచ్చిన విద్యార్థిని ఓ వ్యక్తితో కలిసి ఆటోలో వెళ్లినట్లు తెలిసింది. కళాశాల సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సద్దాం హుసేన్ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

వీపనగండ్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వనపర్తి జిల్లా, వీపనగండ్ల మండలంలో గురువారం చోటుచేసుకున్నది. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం తూముకుంటకు చెందిన ఆవుల రాముడు (48) గొర్రెల కాపరిగా ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. కూతుళ్ల వివాహం, ఇంటి నిర్మాణం కోసం రూ. 10 లక్షలకుపైగా అప్పు చేశాడు. అప్పులు పెరిగిపోవడం అవి తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. సాయంత్రం ఇంట్లో పురుగుల మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు కొల్లాపూర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ రాణి తెలిపారు. భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

నెంబర్ ప్లేట్లు లేకపోతే వాహనాలు సీజ్ : సీఐ



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

వనపర్తి క్రైమ్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాలకు నెంబర్ ప్లేట్ లేకపోతే సీజ్ చేస్తామని సీఐ కృష్ణయ్య హెచ్చరించారు. వనపర్తి పట్టణంలో గురువారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో ఆయన పాల్గొన్నారు. ట్రాఫిక్ ఎస్‌ఐ సురేందర్‌తో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. నెంబర్ ప్లేట్ లేని 30 ద్విచక్ర వాహనాలను గుర్తించి, స్టేషన్‌కు తరలించారు. వాహనదారులకు జరిమానా విధించారు. మరో సారి పట్టుబడితే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ హరిప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

మహిళా సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి కృషి

- ఏపీఎం శేఖర్

తాడూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాలలో ఉన్న మహిళా సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని ఏపీఎం శేఖర్ అన్నారు.



మహిళా సంఘాల సభ్యుల అభ్యున్నతికి తీసుకుంటున్న చర్యలపై ఆయన 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో తెలిపారు.

మండలంలో ఎన్ని సంఘాలు ఉన్నాయి? సభ్యులు ఎంత మంది?

మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలో 653 సంఘాలకు గాను 6350 మంది సభ్యులు ఉన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగానే వారి ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నాం. అందులో భాగంగానే వ్యక్తిగతంగా పాడి పరిశ్రమ అభివృద్ధి, పౌల్ట్రీ ఫారాలు, వ్యాపార సముదాయాలు, గొర్రెల, మేకల పెంపకం వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి ఆసక్తి గల సంఘాలకు రుణాలు మంజూరు చేసే విధంగా ముందుకెళ్తున్నాం.

మహిళా సంఘాల సభ్యులకు స్త్రీనిధి రుణాలు అందుతున్నాయా?

మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో మహిళా సంఘాలకు సంబంధించి ప్రభుత్వం అందజేస్తున్న స్త్రీనిధి రుణాలను గ్రామ సంఘం ఆధ్వర్యంలో రుణాలను అందజేస్తున్నాం. స్త్రీనిధికి సంబంధించి చాలా మంది సభ్యులు పాడి గేదెలు, కిరాణాలు నడిపించుకుంటూ లబ్ధి పొందుతున్నారు. రానున్న రోజుల్లో స్త్రీనిధి రుణాలను ఇంకా పెంచి సభ్యులకు అందజేసే విధంగా ముందుకెళ్తాం.

న్యూస్ బాక్స్

వెల్టూర్ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలి

- డీసీసీ ప్రధాన కార్యదర్శి జిల్లెల్ల జగదీశ్‌రెడ్డి

ఉప్పునుంతల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వెల్టూరు గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి జిల్లెల్ల జగత్‌రెడ్డి అన్నారు. గురువారం ఉప్పునుంతలలో ఆయన మాట్లాడుతూ 27 గ్రామపంచాయతీలు ఉన్న అతి పెద్ద మండలంలో వెల్టూరును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు. పెనిమిళ్ల, గువ్వలోనిపల్లి, లత్తిపూర్, ఈర్లబోనిపల్లి, సూర్యానాయక్‌తండా, సీబీ తండా, పిర్వాటోనిపల్లి, రాయిచెడి, అయ్యవారిపల్లి, సూర్యాతండా, గ్రామాల ప్రజల పరిపాలన సౌలభ్యంగా ఉంటుందన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

వంగూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) మండలంలోని రంగాపూర్ మాజీ సర్పంచ్ చంద్రమౌళి మృతి చెందడంతో విషయం తెలుసుకొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి గురువారం చంద్రమౌళి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరంచంద్రమౌళి చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో శ్రీను, మొగులయ్య పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీ అరికట్టాలి : బీఎస్ఎఫ్

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేటు పాఠశాలలు వసూలు చేస్తున్న అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని బీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ ఎంఈవో భాస్కర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పాఠశాలలను మండల విద్యాధికారులు సందర్శించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మద్దెలబండ సాయిబాబు, నాయకులు భానుప్రకాష్, మహేష్, రమేష్, డానియల్ పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలి

కల్వకుర్తి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలో జనవరి 8న జరిగే బీసీ విద్యార్థుల సమర శంఖారావం వాల్ పోస్టర్‌ను గురువారం స్థానిక నాయకులతో కలిసి ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు భానుచందర్, శివప్రసాద్ ఉన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

కల్వకుర్తి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని 13వ వార్డులో టీయూఎఫ్ఐడీసీ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనులు సకాలంలో నాణ్యతగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌షాహేద్, కౌన్సిలర్ సైదులుగౌడ్, నాయకులు తాహేర్‌అలీ, రమస్వామి, ప్రదీప్, మల్లేష్, వెంకటేశ్, జాంగీర్, మహమ్మద్, కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

చిన్నారులపై శ్రద్ధ వహించాలి

తాడూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నిబంధనల ప్రకారం అంగన్‌వాడీల్లో చిన్నారులపై అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించి వారిలో వయస్సుకు తగ్గ ఎదుగుదల ఉండేలా చూడాలని ఎంపీడీవో బ్రహ్మచారి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన పరిశీలించి విద్యార్థుల ఎదుగుదల, ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు.

పీయూ వీసీ, రిజిస్ట్రార్లకు శుభాకాంక్షలు

- మర్యాదపూర్వకంగా కలిసిన పాలెం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

బిజినేపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాలెంలో వెంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్) ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాములు అధ్యాపక బృందంలో కలిసి గురువారం పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎన్.శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.చెన్నప్పలను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీసీ, రిజిస్ట్రార్లకు పూల మొక్కను ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాములు కళాశాలకు ఈ విద్యా సంవత్సరం అటానమస్ హోదా లభించిందని, ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించి మూల్యాంకనం పూర్తి చేయించామని, త్వరలోనే పరీక్షా ఫలితాలను విడుదల చేయాల్సి ఉందని వైస్ చాన్స్‌లర్, రిజిస్ట్రార్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మజ, లైబ్రేరియన్ వర్కాల శ్రీనివాసులు, అధ్యాపక బృందం డాక్టర్ నాగ రాజు, డాక్టర్ సుష్మ, శివ, వెంకటేశ్, సీనియర్ అసిస్టెంట్ కవిత పాల్గొన్నారు.



పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్, రిజిస్ట్రార్లను మర్యాదపూర్వకంగా కలిసిన పాలెం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

నల్లమలలో టూరిజం అభివృద్ధికి కృషి

- అంతరగంగా శివాలయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట టౌన్/ అమ్రాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నల్లమల ప్రాంతంలో టూరిజం అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మండల పరిధిలోని తెలుగుపల్లి గ్రామ సమీపంలోని లోతట్టు అటవీ ప్రాంతంలో వెలిసిన పురాతన అంతరగంగా శివాలయాన్ని గురువారం అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాములతో కలిసి ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఆలయం ప్రాంగణంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ నల్లమల ప్రాంతం శైవ క్షేత్రాలకు నిలయమని అన్నారు. రూ.13 లక్షలతో అంతరగంగా ఆలయ అభివృద్ధి కోసం కృషి చేయన్నట్లు తెలిపారు. ఈ ఆలయానికి తెలుగు పల్లి గ్రామం నుండి రూ.2 కోట్లతో మెటల్ రోడ్డు తక్షణమే నిర్మించడానికి కృషి చేయన్నున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ వెంకటయ్య, అంతరగంగా ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరినారాయణ గౌడ్, కాంగ్రెస్ నాయకులు నాసరయ్య, మల్లేష్, అశోక్, రాజు, కోటి తదితరులు పాల్గొన్నారు.

● శ్రీశైలం ఉత్తరముఖ ద్వారం శ్రీఉమా మహేశ్వర క్షేత్రంలో గురువారం ఎమ్మెల్యే వంశీకృష్ణ ఈశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల నుంచి 15వ తేది నుండి ఉమామహేశ్వర క్షేత్రంలో ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఆలయ ఈఓ శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి, అర్చకులు ఘనస్వాగతం పలికారు.

పీఎం మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

- పీఎం కిసాన్ సమ్మాన్ నిధి సాయం పెంపుపై హర్షం



బిజినేపల్లిలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, బీజేపీ నాయకులు

బిజినేపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు మూడు విడతల్లోఏడాదికిఅందిస్తున్న రూ.6వేల ఆర్థిక సాయాన్ని రూ.10 వేలకు పెంచుతున్నట్లు ప్రకటించడం పైగురువారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి రైతులు, బీజేపీ నాయకులు అంబేడ్కర్ చౌరస్తాలో క్షీరాభిషేకం చేశారు. పంట పెట్టుబడి సాయం రూ.10 వేలకు పెంచడంతో పాటు డీఏపీని రూ.1050కే ఇవ్వనున్నట్లు ప్రకటించడంతో సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నారాయణా చారి, మండల అధ్యక్షుడు భూషయ్య, తిరుపతయ్య, ఓంప్రకాశ్, రఘుబాబు, శ్రీకాంత్, లక్ష్మీనారాయణ, కృష్ణ, బాలస్వామి, శ్రీశైలం, శేఖర్, నరసింహ ఉన్నారు.

బ్యానర్ కత్తిరించారని బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు

అమ్రాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో 2025 నూతన సంవత్సరం పురస్కరించుకొని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్యానర్ (ఫ్లెక్సీ)ను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కత్తిరించారు. దీనిపై గురువారం అమ్రాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బీఆర్ఎస్ పార్టీ నాయకులు ధర్మయ్య, మల్లేష్, నాసర్‌లు విలేకరులకు తెలిపారు. గత సంవత్సరం కూడా ఇలానే గుర్తు తెలియని వ్యక్తులు తమ పార్టీ బ్యానర్లను కత్తిరించారని, అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని వారు పేర్కొన్నారు. వరుసగా తమ పార్టీ బ్యానర్లను కత్తిరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విధమైన చర్యలకు పాల్పడే వారిని గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వారు పోలీసులకు విజ్ఞప్తి చేశారు. పోలీసులు నిఘా పెట్టి, దుండగులను గుర్తించాలని కోరారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు

కొల్లాపూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నల్లమల గ్రామాల్లో అగ్ని ప్రమాదాల నివారణపై ఆయా గ్రామాల ప్రజలకు అటవీ శాఖ అధికారులు గురువారం అవగాహన కల్పించారు. కొల్లాపూర్ అటవీ రేంజ్ అధికారి చంద్రశేఖర్ ఆదేశాల మేరకు కొల్లాపూర్ రేంజ్ పరిధిలో అటవీ ప్రాంతంలో ఉన్న మొలచింతలపల్లి, ఎర్రగట్టు బొల్లారం, అంజనగిరి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. అడవిలోకి పశువుల, గొర్రెల, కాపరులు వెళ్లొద్దన్నారు. కార్యక్రమంలో అటవీ సెక్షన్ అధికారులు ముజీబ్ ఘోరి, నీలేష్, బయన్న, బీట్ అధికారులు లక్ష్మయ్య, నవీన్, కిరణ్, నాగార్జున, మహేష్, బేస్ క్యాంపు వాచర్లు మొలచింతపల్లి మాజీ సర్పంచ్ కొమ్ము రాజు, ప్రజలు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ ఎరువులు వాడాలి

లింగాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : రైతులు డీఏపీ ఎరువుకు బదులుగా సూటి, కాంప్లెక్స్ ఎరువులను వాడాలని వ్యవసాయ విస్తరణాధికారి భరత్‌కుమార్ రైతులకు సూచించారు. గురువారం సూరాపూర్ రైతు వేదికలో ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు గబ్రు, రవి, శారద, తౌర్య, రేణయ్య తదితరులు పాల్గొన్నారు.

పెంచిన సివిల్ సప్లై హమాలీ రేట్లను అమలు చేయాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్



జిల్లా కేంద్రంలో స్టాక్ పాయింట్ వద్ద సివిల్ సప్లై హమాలీల సమ్మెలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పెంచిన సివిల్ సప్లై హమాలీ రేట్ల జీవోను వెంటనే అమలుచేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో సివిల్ సప్లై గోదాం వద్ద నిరవధిక సమ్మె ప్రారంభించారు. ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ సివిల్ సప్లై హమాలీలు రేట్లను రూ.26 నుంచి 29కి పెంచుతూ ప్రభుత్వం గత అక్టోబరు మూడున జీవో ఇచ్చిందన్నారు. అలాగే గోదాం సామర్థ్యాన్ని బట్టి స్వీపర్లకు అదనంగా రూ. 1000 చెల్లిస్తామని ఇచ్చిన హామీ నేటికి అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలీలు హుస్సేన్, రమేష్, వెంకటయ్య, నరేష్, చంద్రయ్యసుదర్శన్, రాజుపాల్గొన్నారు.

● కల్వకుర్తి : సివిల్ సప్లయ్ గోదాంలో పని చేస్తున్న హమాలీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల పరశురాములు డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలోని సివిల్ సప్లయ్ గోదాం ముందు తెలంగాణ సివిల్ సప్లయ్ అండ్ జీసీసీ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె గురువారం రెండవ రోజుకు చేరుకుంది. సమ్మెకు కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల పరశురాములు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుక బాల్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.అంజనేయులు సంఘీభావం తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు

ఊర్కొండ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్ చేసి విత్తనాలు నాటకపోవడంతో పంచాయతీ కార్య దర్శిపై చర్యలు తప్పవని ఎంపీడీవో కృష్ణయ్య హెచ్చరించారు. గురువారం మండలంలోని గుడిగానిపల్లి, మాధారం, రాచాలపల్లి గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ లు పాల్గొన్నారు.

వృద్ధులకు స్వెటర్లు అందజేత

కొల్లాపూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ పట్టణంలో స్థానిక విశ్వశాంతి వెల్ఫేర్ సొసైటీ వృద్ధాశ్రమంలో సమాచార హక్కు చట్టం రక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజీమ్ మహమ్మద్ పుట్టిన రోజు పురస్కరించుకొని వృద్ధులకు స్వెటర్లను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కొర్ర కిషన్ నాయక్, కార్యదర్శి పగిడిమర్రి యాదగిరి ఉన్నారు.

'ఎస్సీ వర్గీకరణను అమలుపర్చాలి'

కల్వకుర్తి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : సుప్రీం కోర్టు తీర్పుకనుగుణంగా ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలుపర్చాలని బైండ్ల భవనీయ సంఘం జిల్లా అధ్యక్షుడు మామిళ్లపల్లి చంద్రయ్య డిమాండ్ చేశారు. కల్వకుర్తిలో ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు.

అయ్యప్ప స్వాముల ఇరుముడి

వెల్దండ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బుధవారపేట ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం అయ్యప్పస్వాముల ఇరుముడి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నిష్ఠతో అయ్యప్ప దీక్ష చేసిన స్వాములకు గురుస్వాములు ఇరుముడిలు కట్టారు. భక్తులు, బంధుమిత్రులు పెద్దఎత్తున హాజరయ్యారు. పీఏసీఎస్ డైరెక్టర్ వావిళ్ల సంజీవ్‌కుమార్ భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇరుముడి కార్యక్రమానికి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, పీసీసీ సభ్యుడు బాలాజీసింగ్‌లు హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు భూపతిరెడ్డి, ఆర్యవైశ్యసంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చురామకృష్ణ, వెంకటయ్యగౌడ్ ఉన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

పదర, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం సావిత్రిబాయి పూలే జయంతిని అధికారికంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడంపై కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కుంద మల్లికార్జున్ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి తీసుకునే ప్రతీ నిర్ణయం సబ్బండ వర్గాల సంక్షేమంగా ఉన్నాయని పేర్కొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

వెల్దండ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ అమలు చేయాలని రైతు జేఏసీ అధ్యక్షుడు, బీజేపీ సీనియర్ నాయకులు బండెల రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ గ్రామంలో వందలాదిమంది రైతులకు ఇంకా రుణమాఫీ కాలేదని అన్నారు. రుణమాఫీ కాని రైతుల వివరాలను కలెక్టర్‌కు త్వరలోనే ఇవ్వబోతున్నట్లు చెప్పారు. సమావేశంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యెన్నం శేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కుర్మిద్ద యాదగిరి, నాయకులు చక్రవర్తిగౌడ్, శ్రీనివాసాచారి, రామస్వామి, శశిదర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శివప్రసాద్, కొండల్, రవి ఉన్నారు.

పేదలకు ఇళ్లు ఇవ్వాలి : సీపీఎం

నాగర్‌కర్నూల్ టౌన్,జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పరిధిలోని పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి రామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ మేనేజరుకు వినతిపత్రం అందజేశారు.

'ప్రభుత్వ భూమిని చర్చికి కేటాయించాలి'

అచ్చంపేటటౌన్ జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ భూమిని చర్చికి తిరిగి కేటాయించాలని సీయోను యం.బి చర్చి సభ్యుడు అనిల్ కోరారు. పట్టణంలోని సర్వే నెం.293 లో గల 4.32 ఎకరాల ప్రభుత్వ భూమి తిరిగి చర్చికి కేటాయించాలని సీయోను యం.బి చర్చి సభ్యులు ఆర్డీవో కార్యాలయంలో గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అచ్చంపేటలోని సర్వేనెం 293లో 4.32ఎకరాల ప్రభుత్వ భూమిని, మరో సర్వే నెం 68లో 1.32ఎకరాల భూమిని 1953- 54లో చర్చి అభివృద్ధి కోసం కేటాయించారని వారు వివరించారు. చర్చిపైన రిజిస్ట్రేషన్ చేసే అవకాశం లేనందున అప్పటి చర్చి పాస్టర్ యూసఫ్ వంశుల పేరున రిజిస్ట్రేషన్ చేశారని గుర్తు చేశారు. అనంతరం ఆ భూమిని తిరిగి వారి వారసులకు కేటాయించారని గుర్తు చేశారు. ఆ భూమిని తిరిగి చర్చి అభివృద్ధికి కే టాయించాలని కోరామన్నారు. కార్యక్రమంలో సీయోను యం.బిచర్చి సభ్యులు స్వామి, సుంద ర్ రాజు, జాన్‌రాజు, సుధాకర్, భాస్కర్ పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ

పెద్దకొత్తపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పెద్దకొత్తపల్లిలో ఫర్టిలైజర్ షాపులను కొల్లాపూర్ డివిజన్ వ్యవసాయ అధికారి వాస్ గురువారం తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వర ఫర్టిలైజర్ షాపును ఆయన తనిఖీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫర్టిలై జర్ దుకాణాల్లో నకిలీ ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమష్టి కృషితో జిల్లాను ముందు వరుసలో ఉంచుదాం

- కలెక్టర్ బదావత్ సంతోష్



కలెక్టర్ బదావత్ సంతోష్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న అదనపు కలెక్టర్ కె.సీతారామారావు

నాగర్‌కర్నూల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : కొత్త సంవత్సరంలో అందరం సమష్టి కృషితో అర్హులైన ప్రతీ లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాల అమలులో జిల్లాను ముందు వరుసలో ఉంచుదామని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో నూతన సంవత్సరం పురస్కరించుకొని కలెక్టర్ బదావత్ సంతోష్‌కు కలెక్టరేట్ వివిధ శాఖల ఉద్యోగులు పుష్ప గుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అదనపు కలెక్టర్ కే.సీతారామారావు, జిల్లా అధికారులు చిన్న ఓబులేష్, రాంలాల్, స్వరాజ్యలక్ష్మి, రామ్మోహన్‌రావు, ఖాజాఅఫ్సర్ అలీ, శ్రవణ్‌కుమార్, రమాదేవి, శ్రీనివాస్‌రెడ్డి, సీతారాం నాయక్, ఆర్డీవోలు, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, పలువురు పాత్రికేయులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

జేపల్లి గ్రామాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే



ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డిని శాలువాతో సన్మానిస్తున్న నాయకులు

చారకొండ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మండలంలోని జేపల్లి, నెమలిగుట్టతండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు గురువారం కలిసి నూతన సంవత్సర శుభకాంక్షలు తెలిపి, పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. జేపల్లి గ్రామ పంచాయతీని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని వారు ఎమ్మెల్యేను కోరారు. గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తానని హామి ఇచ్చారని నాయకులు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు పవన్‌కుమార్ నాయక్, రాజు, శేఖర్, మాజీ వార్డు సభ్యుడు వెంకటేష్, యాదగిరి, ప్రశాంత్, కృష్ణ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

వెల్దండ : అనారోగ్యంతో బాధపడుతున్న మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన కాయితి మధుకర్‌రెడ్డికి చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరైంది. గురువారం ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి మంజూరైన రూ.34వేల చెక్కును లబ్ధిదారునికి అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ కేశమళ్ల కృష్ణ, శ్రీనునాయక్, ఆంజనేయులు, అనిల్ కుమార్ ఉన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు

- జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్



మోడల్‌స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న రమేష్‌కుమార్

నాగర్ కర్నూల్‌టౌన్/ వెల్దండ, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీ, మోడల్‌స్కూల్, బాలికల ఉన్నతపాఠశాలను డీఈవో రమేష్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లోని మౌలికవసతులను పరిశీలించారు. మెరుగైన ఫలితాలు రాకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో చంద్రుడు, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీధర్, ప్రధానోపాధ్యాయురాలు సుగుణ ఉన్నారు.

అర్బన్ రెసిడెన్సియల్ తనిఖీ

జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్సియల్ పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి రమేష్‌కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఈవో మాట్లాడుతూ అర్బన్ రెసిడెన్సియల్‌లో చదివే విద్యార్థులు అనాథ, తల్లిదండ్రులు వలస వెళ్లిన వారే ఉంటారని, వారి ఆరోగ్యం, చదువు పట్ల జాగ్రత్త వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. డీఈవో వెంట విద్యాశాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజీ ఇవ్వాలి

- ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మురళి



నాగర్‌కర్నూల్‌లో మానవహారంతో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

నాగర్‌కర్నూల్‌టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : దశాబ్ద కాలంగా విద్యాశాఖలో కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులకు వేతనాలు పెంచడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో వేయిటేజీ ఇవ్వాలని ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మురళి డిమాండ్ చేశారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులు నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం 24వ రోజు జిల్లా కేంద్రంలోని ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ చౌరస్తాలో మానవహారంతో నిరసన వ్యక్తం చేశారు. మురళి మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని 24 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించపోవడంతో ఎంఈవో, డీఈవో కార్యాలయాలు మూతపడి విద్యావ్యవస్థ పాలన స్తంభించిందన్నారు. అదేవిధంగా కేజీబీవీ, యూఆర్ఎస్, భవిత పాఠశాలల్లో బోధన బంద్ అయ్యిందన్నారు. అధికారంలోకి వస్తే ఎస్ఎస్ ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి పేస్కేలు అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శులు ఉమాదేవి, ప్రకాష్, ఉపాధ్యక్షులు విష్ణు, శివలింగం, శ్రీనివాస్, కోశాధికారి సందీప్ ఉన్నారు.

చెంచుల అభివృద్ధికి చేయూత

- యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రాథోడ్



చెంచులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న శ్రీనివాస్‌రాథోడ్

లింగాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద చెంచుల అభివృద్ధే లక్ష్యంగా తన వంతు సహాయ, సహకారాలను అందిస్తున్నట్లు యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రాథోడ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలోని 150 మంది గిరిజన చెంచులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చెంచు, గిరిజనుల అభివృద్ధికి డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజు, వెంకటాములు, భగవాన్, అచ్యుతారెడ్డి, జగదీష్, వెంకటరాజు, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు ఇందిరమ్మ, మానుపాటు విజయలక్ష్మి, నందిని, నాయకులు సురేందర్‌రావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కాశీనాథం, నాయకులు కృష్ణనాయక్, శశీధర్, చీర్ల కృష్ణయ్య, రాంచందర్, మహేష్ పాల్గొన్నారు.